


బైబై వైసీపీ.. కూటమిదే పీఠం





క్లీన్ స్వీప్ : మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ రిజల్ట్

అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమిదే పైచేయిగా తేలింది. భారీ సీట్ల ఆధిక్యతతో అధికారంలోకి రాబోతున్నట్టు సుస్పష్టమైంది. అధికార వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతున్నట్టు శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు తేటతెల్లం చేశాయి. దాదాపు అన్ని సంస్థలు టీడీపీ కూటమికే పట్టం కట్టాయి. భారీ మెజార్టీతో టీడీపీ ప్రభుత్వం రాబోతున్నట్లు తేల్చి చెప్పాయి. జిల్లాలో ఏడుకు ఏడు సీట్లు టీడీపీ, జనసేన గెల్చుకోబోతున్నట్టు స్పష్టంచేశాయి. కాకినాడ ఎంపీ స్థానంలో జనసేన జయకేతనం ఎగురవేయనున్నట్టు పేర్కొన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో జిల్లాలో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ ఖాయమని ఘంటాపథంగా పేర్కొన్నాయి. గతనెల 13న జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి బట్టి టీడీపీ, జనసేన భారీగా విజయం సాధించబోతున్నట్టు భారీ విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. అధికార వైసీపీ అరాచకాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలతో విసుగెత్తిన ఓటర్లు ఆ పార్టీని ఓటుతో చాచికొట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం గెలుపు ఖాయం అని ప్రతి ఒక్కరి నోటా అభిప్రాయం వ్యక్తమైంది. దీనికి తగ్గట్లుగానే ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు కూడా టీడీపీ కూటమిదే విజయమని తేల్చేశాయి. దీంతో సంబరాలు వ్యక్తమవుతున్నాయి.

- అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్‌పోల్ ఫలితాల్లో కూటమిదే హవా
- రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం రాబోతున్నట్టు తేల్చిచెప్పిన సర్వే సంస్థలు
- జిల్లాలో ఏడుకు ఏడు సీట్లు టీడీపీ, జనసేన గెలుస్తున్నట్టు వెల్లడి
- కాకినాడ పార్లమెంట్ స్థానంలో జనసేన విజయకేతనమని సుస్పష్టం
- ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో టీడీపీ, జనసేన పార్టీల్లో జోష్.. కేడర్‌లో సంబరాలు
- సర్వే ఫలితాల్లో వైసీపీ ఓటమి ఖాయమని తేలడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో డీలా
- జిల్లాలో ఒక్క స్థానం కూడా గెలిచే అవకాశం లేన్నట్టు అంచనాలు చెబుతుండడంతో కలవరం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఈసారి కాకినాడ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావాలనే కాంక్షతో అధికార వైసీపీ అనేక అడ్డదార్లు తొక్కింది. అయిదేళ్ల అరాచక, పాలనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండడం, అటు ఉద్యోగుల్లోను తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో అధికారంలోకి రామేమోనన్న భయం వైసీపీని వెన్నాడింది. దీంతో జిల్లాలో పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చేసింది. అటు టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఎన్నికల బరిలో నిలబడడంతో నియోజకవర్గాల్లో ఓటర్లకు వేలల్లో డబ్బులు పంచింది. మద్యం డంప్‌లు దించింది. కడప ముఠాలను ప్రయోగించింది. పోలింగ్ రోజు గొడవలు, కొట్లాటలకు దిగింది. అదే సమయంలో ప్రతిపక్ష టీడీపీ సైతం ఈ ఎన్నికలను చావోరేవోగా తీసుకుంది. జనసేనతో జతకట్టి ఎన్నికల్లో పోటీ చేసింది. అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించింది. వెరసి అధికార వైసీపీ ఆర్థిక,అంగబలాన్ని బలంగా తట్టుకుని నిలబడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమిదే విజయం అని ముందునుంచీ సర్వత్రా అంచనాలు నెలకొన్నాయి. ఒకపక్క టీడీపీ అధినేత చంద్రబాబు, మరోపక్క జనసేన అధినేత పవన్ జిల్లాలో విస్తృతంగా తిరిగారు. అన్ని నియోజకవర్గాల్లో సభలు, సమావేశాలతో దుమ్మురేపారు. అటు పోలింగ్‌రోజు ఓట్లు చీలకుండా సమీకరణ భారీగా జరిగింది. అటు వైసీపీపై ఆగ్రహంతో ఉన్న జనం ఓట్లతో అధికార పార్టీని చాచి కొట్టారు. భూహక్కు చట్టం భయంతో లాగిపెట్టి బూత్‌ల్లో కొట్టారు. ఎక్కడెక్కడి నుంచో వలస ఓటర్లు ఓపిగ్గా వచ్చి ఓట్లేశారు. ఈ నేపథ్యంలో పోలింగ్ జిల్లాలో 80 శాతం దాటిపోయింది. తద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీగా ఓట్లు పోలయ్యాయన్న విశ్లేషణలకు బలం చేకూరినట్టయింది. అటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం బ్యాలెట్ ఓట్లతో కసిగా వైసీపీని కొట్టారు. వెరసి ఓట్ల లెక్కింపునకు ముందే టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని తేలిపోయింది. దీనికి తగ్గట్టుగానే శనివారం సాయంత్రం ఆరున్నర తర్వాత వెల్లడైన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలంతా అనుకున్నట్టుగా వచ్చాయి. పీపుల్ పల్స్, చాణక్య, రైజ్, ఆరా, కేకే వంటి మొత్తం 19 ప్రధాన సంస్థలు సర్వేలు ప్రకటించగా, అందులో 17 సంస్థలు రాష్ట్రంలో టీడీపీ కూటమి భారీ మెజార్టీతో అధికారంలోకి రాబోతున్నట్టు తేల్చిచెప్పాయి. తద్వారా అధికార వైసీపీ చిత్తుగా ఓడిపోతున్నట్టు నిర్ధారించాయి. ఎగ్జిట్‌పోల్స్ సర్వేల ప్రకారం దాదాపు అన్ని సంస్థలు జిల్లాలో ఏడుకు ఏడు స్థానాల్లో టీడీపీ, జనసేన విజయం సాధిస్తున్నట్టు స్పష్టంచేశాయి. కాకినాడ సిటీ, పెద్దాపురం, జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుస్తున్నట్టు పేర్కొన్నాయి. పిఠాపురం, కాకినాడ రూరల్‌ల్లో జనసేన అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని వివరించాయి. ఒక్క సర్వే సంస్థ మాత్రం జిల్లాలో తుని స్థానం ఒకటే వైసీపీ దక్కించుకోనున్నట్టు పేర్కొంది. ఏడుకు ఆరు స్థానాల్లో టీడీపీ కూటమి గెలుస్తుందని తెలిపింది. కాకినాడ ఎంపీ సీటు జనసేన గెలుచుకుంటుందని ప్రకటించాయి. ఒకరకంగా చెప్పాలంటే 19 ప్రధాన సంస్థలు ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెల్లడించగా, 17 సంస్థలు టీడీపీ కూటమిదే విజయమని స్పష్టంచేశాయి. ఏపీలోను, జిల్లాలోను క్లీన్‌స్వీప్ అని విస్పష్టంగా ప్రకటించడం గమనించాల్సిన విషయం.

అటు సంబరాలు..ఇటు డీలా..

ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో జిల్లా టీడీపీలో సంబరాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నేళ్ల పోరాటం ఫలించిందంటూ ఆనందపడుతున్నాయి. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుందని తేలడంతో నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. తామేదైతే విశ్లేషించుకున్నామో ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు కూడా అలాగే రావడంతో సంతోషం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగాను, జిల్లాలోను భారీ సీట్లు టీడీపీ కూటమి దక్కించుకుంటుందని ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల్లో తేలడంతో వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా బుద్ధిచెప్పినట్టయిందని పలువురు పేర్కొంటున్నారు. టీడీపీ, జనసేన కూటమి జిల్లాలోను, రాష్ట్రంలోను ప్రభంజనం సృష్టిస్తుందన్న అంచనాలు నిజమయ్యాయని నియోజకవర్గ అభ్యర్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నొక్కిన ఉత్తుత్తి బటన్‌లను ప్రజలు నమ్మలేదని, ముఖ్యంగా మహిళలు వైసీపీకి బుద్ధి చెప్పారని వివరిస్తున్నారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో కూటమికి ఓట్లు భారీగా రాల్చిందని కూటమి శ్రేణులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల అనంతరం ఆయా నేతలు, పార్టీ కార్యకర్తలు ఫోన్లు చేసుకుని సంతోషం పంచుకున్నారు. అటు అధికార పార్టీ నేతలను ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తీవ్ర నిరాశలో ముంచేశాయి. వైసీపీ గద్దె దిగడం ఖాయమని తేలిపోవడంతో జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీలా పడిపోయారు. మరోవైపు వైసీపీపై ఇప్పటికే బెట్టింగులు కాసినవారంతా గగ్గోలు పెడుతున్నారు. శనివారం ఆ పార్టీపై పందెం కాసేవారే కరువయ్యారు.

ఓట్ల లెక్కింపు ఘట్టానికి
ఇక రెండు రోజులే!

సర్వం సిద్ధంచేసిన అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఇక రెండు రోజులే మిగిలింది. దీంతో అధికారులు లెక్కింపునకు సర్వం సిద్ధం చేశారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో ఓట్ల లెక్కింపు కోసం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగాయి. జిల్లాలో కాకినాడ పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈవీఎం ద్వారా డైరెక్ట్ ఓటింగ్‌లో 13,12,223 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ద్వారా 18,470 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఓట్లు వేశారు. దీంతో జిల్లాలో 81 శాతం ఓటింగ్ నమోదైంది. గతంలోకంటే అధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. అయితే కాకినాడ పార్లమెంట్‌తోపాటు కాకినాడ నగరం, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గాల లెక్కింపు క్రతువును ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఆరంభమవుతుంది. దీంతో అధికార యంత్రాంగం అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 టేబుళ్ల చొప్పున లెక్కింపునకు ఏర్పాటుచేసింది. అలాగే పార్లమెంట్ నియోజకవర్గానికి కూడా దీనికి సమాంతరంగా ఏర్పాట్లు చేసింది. తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు చర్యలు తీసుకుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సాగు అవకాశం కల్పిస్తుంది. ఓట్లు స్వల్పంగా పోలైన నియోజకవర్గాల ఫలితాలు ముందుగా వస్తాయి. ఓట్లు అధికంగా పోలైన నియోజకవర్గాల ఫలితాలు కొంత ఆలస్యం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లెక్కింపు ప్రక్రియకు ఇంక రెండు రోజులే ఉండడంతో అభ్యర్థులతోపాటు జిల్లా ప్రజలు ఎంతో ఉత్కంఠంగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

ఈనెల 4వ తేదీన టీవీల ముందే..

జిల్లాలో ప్రజలు ఈనెల 4వ తేదీన టీవీల ముందే ఉండి ఎన్నికల ఫలితాలను వీక్షించనున్నారు. ఇప్పటికే ప్రజలు దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, అనుచరగణం ఎక్కడిక్కడ టీవీల ముందు కూర్చుని చూసేందుకు వీలైన ఏర్పాట్లు చేశారు. ఈసారి ప్రతి ఒక్కరూ ఆరోజు బయటకు వెళ్లకుండా టీవీలను వీక్షించి తమ పార్టీల గెలుపు ఓటములను వీక్షించాలని నిర్ణయించుకున్నారు. అలాగే హోటళ్లలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని వీక్షించేలా కొందరు సిద్ధమయ్యారు.



కౌంటింగ్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్

ఓట్ల లెక్కింపులో పూర్తి అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ నివాస్

సర్పవరం జంక్షన్, జూన్1: ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ కోరారు. శనివారం కాకినాడ రూరల్ ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సిబ్బందికి ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల లెక్కింపు, సర్వీస్ ఓట్ల కౌంటింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడి విధులు నిర్వహించాలన్నారు. సరైన నిర్వహణతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఏదైనా ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నప్పుడు ఎటువంటి గందరగోళానికి, తొందరపాటుకు గురికావద్దన్నారు. ఈ సమయంలో సంయమనంతో ఎన్నికల మార్గదర్శకాలు, నియమ నిబంధనలను కౌంటింగ్ ఏజెంట్లకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కౌంటింగ్ సమయంలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, వీరు ప్రతీ దశలోను అప్రమత్తంగా ఉంటూ ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరిగే చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతం చేసేందుకు రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లను ఏడు విభాగాలుగా విభజించి, విడిగా ఆర్వోలతో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జూన్ 3న కౌంటింగ్ సిబ్బందిని ఆయా నియోజకవర్గాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్వో ఇట్ల కిషోర్‌తోపాటు మిగతా 6 నియోజకవర్గాలకు చెందిన ఆర్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో సమీక్ష చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం, జూన్ 1: సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులకు సూచించారు. ఆయన శనివారం రాత్రి పిఠాపురం పట్టణంలో పర్యటించారు. స్థానిక ఉప్పాడ సెంటర్‌లో పరిస్థితిని సమీక్షించారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన నేపథ్యంలో ఉన్న పరిస్థితి, కౌంటింగ్ సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. ప్రజలంతా శాంతియుతంగా, సంయమనంతో ఉండాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎస్ఐ మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

జిల్లా పరిశ్రమలశాఖ ఇన్‌చార్జి జీఎంగా ఆదిశేషు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), జూన్ 1: ఐస్ ఫ్యాక్టరీకి సబ్సిడీ మంజూరు కోసం రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్న కాకినాడ జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ టి మురళీని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆశాఖ కమిషనర్ మే 23న ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో ఏలూరు జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం వి.ఆదిశేషును కాకినాడ జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీకాగా ఆయన శనివారం విధుల్లో చేరారు. కాకినాడకు చెందిన పెమ్మాడి శ్రీనివాసరావు తన భార్య శ్రీముఖి పేరుతో సర్పవరం ఆటోనగర్‌లో స్థాపించిన ఐస్‌ఫ్యాక్టరీకి ప్రభుత్వ ప్రోత్సాహకంగా రావాల్సిన సుమారు రూ.40 లక్షల నుంచి 50 లక్షల రాయితీ కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకుంది.



కాకినాడలో వాన పడుతున్న దృశ్యం



సామర్లకోటలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి తడిసిముద్దయిన రోడ్లు

ఉరుములు, మెరుపులతో హడలెత్తించి..
కురిసిన వర్షం

తెల్లవారుజామున పిడుగుల శబ్దాలు.. వానతో ఒక్కసారిగా చల్లబడిపోయిన వాతావరణం

కాకినాడ సిటీ, జూన్ 1 : కాకినాడలో శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మొదలైన ఈ వర్షం ఉదయం 7 గంటల వరకు పడింది. భారీ శబ్దాలతో వెలువడిన ఉరుములు, మెరుపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీనికి తోడు కరెంటు సరఫరా నిలిపివేయడంతో తెల్లవారే వరకు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. సముద్ర తీరానికి దగ్గరగా ఉన్న దుమ్ములపేట, పర్లోవపేట తదితర ప్రాంతాల్లో గుడిసెల్లోను, ఒక మాదిరి ఇళ్లలో నివాసముంటున్న ప్రజలంతా హడలెత్తిపోయారు. ఈ శబ్దాలకు చంటి పిల్లలు, వృద్ధులు భయపడిపోయారు. నేలగట్టితనం లేని ప్రాంతాల్లో ఇళ్లు కూలిపోతాయేమోనని జనం ఆందోళన చెందారు. పిడుగులు పడతాయని ప్రజలు ఇళ్లలోంచి బయటకు రాలేదు. ఈ అకాల వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అయితే గత నాలుగు రోజులుగా రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు నిప్పుల కొలిమిని తలపించాయి. విపరీతమైన ఉక్కపోతతోపాటు గాలిలో తేమశాతం పడిపోవడంతో ప్రజలు ఊపిరి ఆడనంత ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, చంటి పిల్లల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఇలా మండుటెండలతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం చల్లదనం ఇచ్చినట్టయింది. ఎండాకాలంలో వర్షం పడటంతో ప్రజలు సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగా ఉండడంతో జనం ఇళ్ల నుంచి బయటకొచ్చారు.

జిల్లాలో 66.4 మీ.మీ, వర్షపాతం నమోదు..

గడిచిన 24 గంటల్లో 326.4 మీ.మీ వర్షం కురవగా, సరాసరి 15.5 మీ.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తొండంగి మండలంలో 66.4 మీ.మీ., అత్యల్పంగా ఏలేశ్వరంలో 0.6 మీ.మీ నమోదైంది. మండలాల వారీగా తాళ్లరేవు 48.2, కోటనందూరు 32.6, కాకినాడ రూరల్ 28.6, యు.కొత్తపల్లి 26.2, కాజులూరు 22.4, తుని 19.4, కిర్లంపూడి 17.4, గొల్లప్రోలు 10.2, కాకినాడ అర్బన్ 9.4, సామర్లకోట 8.0, కరప 7.6, రౌతుల పూడి 7.4, శంఖవరం 5.6, పెదపూడి 4.8, పిఠాపురం 4.2, పెద్దాపురం 3.6, ప్రత్తిపాడు 2.0, జగ్గంపేట 1.8 మీ.మీ.



మలేరియా వ్యతిరేక దినోత్సవం ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

మలేరియా నివారణ కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ జె. నరసింహనాయక్

జీజీహెచ్ (కాకినాడ), జూన్1: మురుగునీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి మలేరియా నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె. నరసింహనాయక్ కోరారు. శనివారం కాకినాడ జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద మలేరియా వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకుని ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 'సమానత్వంకోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని మరింత ఉధృతం చేద్దాం' అనే నినాదంతో విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా వాటి ఆవాసాలు గుర్తించి ధ్వంసం చేయాలన్నారు. దోమలవ్యాప్తిని అరికట్టగలిగితే మలేరియాను నివారించవచ్చన్నారు. 2030 నాటికి ప్రపంచ మలేరియా నిర్మూలన జరిగేలా వివిధ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఆర్ రమేష్, మలేరియా అధికారి ఎస్ భాస్కరరావు, డీఐవో డాక్టర్ రత్నకుమార్ పాల్గొన్నారు.



హనుమజ్జయంతి సందర్భంగా తుని మండలం కుమ్మరిలోవ సమీపంలోని తపోవనములో హనుమంతునికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం - తుని రూరల్

ఐటీఐ ప్రవేశ వెరిఫికేషన్ ఆఖరి తేదీ ఈనెల 10

కార్పొరేషన్ (కాకినాడ),జూన్1: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తప్పనిసరిగా దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐల వద్ద వెరిఫై చేయించుకోవాలని జిల్లా కన్వీనర్ తెలిపారు. ఈనెల 10వ తేదీలోపు వెరిఫికేషన్ పూర్తికావాలన్నారు. కాకినాడ, జగ్గంపేట ఐటీఐలు, అమలాపురంలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని, లేదంటే మెరిట్ జాబితాలోకి పరిగణించబడదని ఆయన తెలిపారు.

పాఠశాలల్లో ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్‌పై కార్యక్రమాలు

కాకినాడ రూరల్, జూన్1: ఈనెల 5న జరుపుకుంటున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ అనే అంశం ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్రపథక సంచాలకులు ఆదేశాలు జారీచేసినట్టు జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. 'ఒక్క ప్లాస్టిక్ వినియోగం కూడా వద్దు' అనే నినాదంతో జూన్ 5 ర్యాలీలు నిర్వహించాలన్నారు. 12న జలపొదుపు, నీటి వృథా తగ్గించడం, లీకేజీలు లేకుండా చూడడం, 13న శక్తి పొదుపు, ఎకో క్లబ్‌లో ఎనర్జీ టీంఏర్పాటు. 14న చెత్త తగ్గించడం, 15న ఎలక్ట్రానిక్ చెత్త తగ్గించడం, 18న స్థిరమైన ఆహార వ్యవస్థలను అనుసరించడం, 19న ఆరోగ్య శైలి అనుసరించడం వంటివి పాఠశాలల్లో నిర్వహించాలని సీఎంవో సీహెచ్ నాగేశ్వరరావు సూచించారు.

మునిసిపల్ ఆర్‌డీగా
నాగ నరసింహరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీహెచ్ నాగ నరసింహరావు

రాజమహేంద్రవరం సిటీ/కార్పొరేషన్(కాకినాడ), జూన్ 1 : రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్‌గా సీహెచ్. నాగనరసింహరావు నియమితులయ్యారు. మునిసిపల్ ఆర్‌డీగా పనిచేసిన నాగళ్ళ వీర వెంకట సత్యనారాయణ పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావును ఆర్‌డీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1999 గ్రూప్-2 బ్యాచ్‌కు చెందిన నాగ నరసింహరావు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో భీమవరం, పాలకొల్లు, కొవ్వూరు, నరసాపురం మునిసిపాలిటీలకు కమిషనర్‌గా సేవలందించారు. కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆర్‌డీ నాగనరసింహరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా అంకితభావంతో సేవలంది స్తానన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల పరిధిలో 34 మునిసిపాలిటీలు తన పరిధిలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలు మునిసిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఏపీ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, సిబ్బంది అభినందించారు.

కాలువలకు జలకళ..


ధవళేశ్వరం వద్ద స్విచ్ఛాన్ చేసి నీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ మాధవీలత

- డెల్టా కాలువలకు సాగునీరు విడుదల
- మూడు కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల
- 'తూర్పు' కలెక్టర్ మాధవీలత పూజలు

దవళేశ్వరం, జూన్ 1: రైతులు సకాలంలో నాట్లు పూర్తి చేసుకుంటే పంట ప్రకృతి విపత్తుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అందుకే జూన్ 1న సాగునీటిని విడుదల చేస్తున్నామని కలెక్టర్ మాధవీలత అన్నారు. గోదావరి డెల్టా పరిధిలోని మూడు ప్రధాన పంట కాల్వలకు శనివారం సాగునీరు విడుదల చేశారు. ఉదయం తూర్పుడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద ఆమె గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు సమర్పించారు. స్లూయిజ్‌గేట్లు ఎత్తి మోటార్ స్విచ్ ఆన్‌చేసి తూర్పుడెల్టా కాలువకు నీటిని విడుదల చేశారు. తదుపరి గోదావరి డెల్టా సీఈ ఆర్.సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు మిగిలిన 3 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు మధ్యడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద పూజలు నిర్వహించి కాలువకు సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఈస్ట్రన్ డివిజన్ ఈఈ కె.రామకృష్ణ, డీఈ ఇ.రమేష్, ఏఈఈ కె.నాగలక్ష్మి, ఏఈలు అద్దంకి సాయిరాం, ఆర్.సునీల్‌బాబు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల

నిడదవోలు, జూన్ 1: నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద శనివారం పశ్చిమ డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎమ్.దక్షిణామూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. కాలువలు కట్టేసిన అనంతరం తిరిగి పశ్చిమ డెల్టా కాలువలకు శనివారం నీటిని విడుదలచేసిన సందర్భంగా విజ్జేశ్వరం బ్యారేజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీర, రవిక, గాజులు, పువ్వులు, పండ్లు సమర్పించారు. అనంతరం హారతులిచ్చి ఈఈ దక్షిణామూర్తి బ్యారేజ్ వద్ద స్విచ్ ఆన్ చేసి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, తర్వాత అవసరానికి తగినట్టుగా పెంచుతామన్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని రైతాంగం సార్వాను త్వరగా ప్రారంభించడం ద్వారా దాళ్వా కూడా త్వరగా ప్రారంభం అవుతుందన్నారు. ముందుగానే నీటిని విడుదల చేస్తున్నందున రైతాంగం ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శెట్టిపేట జేఈ కిరణ్ కుమార్, నీటి పారుదలశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమంలో ఎక్కడా రాజకీయ నాయకులు లేకపోవడంతో కార్యక్రమ మంతా అధికారుల చేతులమీదుగా సాగింది.


ధవళేశ్వరం వద్ద గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు


విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద నీటిని విడుదల చేస్తున్న ఈఈ దక్షిణామూర్తి

సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

- అల్లర్లలో కోనసీమ నంబరు వన్
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- అల్లర్ల అణచివేతకు క్యూఆర్టీ బృందాలు
- ఎస్ఈబీ ఐజీ రవిప్రకాష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఐజీ రవిప్రకాష్, చిత్రంలో ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, జూన్ 1: ఏలూరు రేంజ్‌లో సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు శాంతిభద్రతల ప్రత్యేక అధికారి, ఎస్ఈబీ ఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఏలూరు రేంజ్‌లో కోనసీమలో అల్లర్లతో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో దెందులూరు, నూజివీడు, కృష్ణాజిల్లాలోని గన్నవరం, పెనమలూరు, మచిలీపట్నం నియోజకవర్గాలను సెన్సిటివ్ నియోజకవర్గాలుగా గుర్తించామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి శనివారం ఐజీ రవిప్రకాష్ విలేఖరులతో మాట్లాడారు. ఏలూరు రేంజ్‌లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలతో పాటు ఎక్కడా అల్లర్లు జరగకుండా క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్టీ)లను ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి జీపీఎస్ లోకేషన్స్ ఫీడ్‌చేసి క్యూఆర్టీ బృందాలకు అందించామన్నారు. ఒక్కో బృందానికి 5 నుంచి 15 గ్రామాల బాధ్యతను అప్పగించాం. ఎక్కడైనా గొడవ జరిగితే ఐదారు నిమిషాల వ్యవధిలోనే క్యూఆర్టీ బృందాలు అక్కడకు చేరుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్ఐ, సీఐల ఆధీనంలో క్యూఆర్టీ టీములను ఏర్పాటు చేశామన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశాం. ఇప్పటికే సెక్షన్ 30తో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని రేంజ్‌లో గతంలో ఆయా ప్రాంతాల్లో పనిచేసిన పోలీసు అధికారులను శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా నియమించామన్నారు. వీరితోపాటు పారా మిలటరీ, ఏపీ ఎస్పీ ఇతర బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోలీసులు ప్రజాస్వామ్య పరిరక్షకులుగా ఉండడం పట్ల గర్వపడుతున్నామన్నారు. హింసకు పాల్పడడంవల్ల ప్రజలే నష్టపోతారన్నారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ప్రజలు కూడా బాధ్యత వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఇప్పటికే ప్రజాతీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉందని, ఎన్నికలు వస్తుంటాయి. పోతుంటాయి ప్రజలు కులాల పేరిట, వర్గాల పేరిట కొట్టుకోవడం తగదని హితవు పలికారు. డీజీపీ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ పార్టీలతో పాటు స్ట్రైకింగ్ ఫోర్సులు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షకులుగా ఉంటారన్నారు. లెక్కింపు సమయంలో గెలుపు ఓటముల ప్రభావం గ్రామాల్లో పడే అవకాశం ఉన్నందున వాటిని అరికట్టేందుకు క్యూఆర్టీ బృందాలు సిద్ధంగా ఉన్నట్టు ఐజీ వివరించారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గోవింద నామస్మరణలతో మార్మోగిన వెంకన్న ఆలయం

- స్వామి ఒక రోజు ఆదాయం రూ.35.61లక్షలు

ఆత్రేయపురం, జూన్ 1: కోనసీమ తిరులమ వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం స్వామివారికి ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని దర్శించుకున్నారు. అశేష భక్తజనం తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా పోటెత్తిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.35.61లక్షలు లభించినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

- వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద భవన నిర్మాణానికి మండపేటకు చెందిన బొడ్డు అవినాష్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 1: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,21,420, అన్నదాన విరాళాలు రూ.62,408 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 9,440 తులాభారం రూ.350, లడ్డూ ప్రసాదం ద్వారా 15,915 వెరసి రూ.3,09,533 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దాపురం: తిరుపతి శృంగారవల్లభస్వామి, దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

పద్మ పురస్కారాలకు క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 1: గణతంత్ర వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే అత్యున్నత పద్మ పురస్కారాలు-2025కు అంతర్జాతీయ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో జిల్లా నుంచి అత్యున్నత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారులు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 1వ తేదీలోగా దరఖాస్తులను ఇ మెయిల్ ద్వారా అందజేస్తే అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


శనేశ్వరాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, జూన్ 1: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వ దర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,01,943 ఆదాయం లభించినట్టు ఆలయ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

పంటకాలువలో గుర్తుతెలియని
మృతదేహం లభ్యం



నడకుదురు (కరప), జూన్ 1: కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. స్థానిక మైత్రి ఫర్నీచర్ షాప్ సమీపంలోని పంటకాలువలో మృతదేహం ఉన్నట్టు తమకు సమాచారం రాగా ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టామన్నారు. 60-70 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వృద్ధుడు పంటకాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించినట్టుగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరుస్తామని, అతని ఆచూకీ తెలిసిన వారు వివరాలను 9440 796557కుగాని, కరప పోలీస్‌స్టేషన్‌కుగాని తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తిచేశారు.

మోటార్ విడి భాగాలు పడి
కార్మికుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన దేవుడు

పెద్దాపురం, జూన్ 1: కాకినాడ జిల్లా పెద్దాపురం వాలుతిమ్మాపురం ప్రధాన రహదారిలో ఉన్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మోటార్ విడి భాగాలు తలపై పడడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పరిశ్రమలో పారా బాయిలర్ వద్ద పనిచేస్తున్న ఉల్లి దేవుడు (36)పై మోటార్ విడిభాగాలు పైనుంచి తలపై పడడంతో తీవ్రంగా గాయాలపాలై మృతి చెందాడు. అయితే పరిశ్రమ యాజమాన్యం మాత్రం ఈ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసిందని కార్మిక సంఘాలు ఆరోపించాయి. ఇటీవల కాలంలో పరిశ్రమలో అనేక ప్రమాదాలు జరిగినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ డిమాండ్ చేశారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితులకు రిమాండ్


గంజాయి తరలిస్తున్న నిందితులతో ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం, జూన్ 1: మండలంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టుచేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మండల ఎగువ ప్రాంతాల్లో గుర్తేడు, దారగడ్డ మీదుగా మోటారు బైక్‌పై గంజాయిని తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు కొమరవరం సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణాజిల్లాకు చెందిన కుంబా సాయిప్రసాద్, ఆయాజిత్తుల కులదీప శ్రీనివాస మృత్యుంజయ, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కారా కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. వారివద్ద నుంచి ఆరు కేజీల గంజాయితో పాటు ఒక మోటారు బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అడ్డతీగల సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి తాతబ్బాయిదొర, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, జూన్ 1: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకులు విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కిటకిటలాడింది. కొత్త, పాత ఆలయాల వద్ద భక్తుల కోలాహలంతో సందడి నెలకొంది. శనివారం వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలు రూ.2,70,590 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 3,849మంది భక్తులు దర్శించుకుని 3,061మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


బాలబాలాజీస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు జట్లకు మూడో స్థానం

పిఠాపురం, జూన్ 1: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లుకు మూడవ స్థానం లభించింది. విశాఖ జిల్లా తిమ్మాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి మెన్స్ అండ్ గర్ల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా రగ్బీ జట్లు మంచి ప్రతిభ కనబరచాయి. రెండు జట్లు మూడవ స్థానంలో నిలవడంతో క్రీడాకారులను రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోచ్ పి.లక్ష్మణరావు, టీఎమ్ మేనేజర్లు బి.వంశీ నవీన్, పవన్, జి.శివప్రసాద్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. శ్రీనివాసకుమార్, కె.పద్మనాభం, టెక్నికల్ కమిటీ చైర్మన్ నాగలింగేశ్వరరావు, సభ్యులు వియ్యపు రామన్నరాజు, కేతవరపు కృష్ణ, సోము గోవిందరాజు తదితరులు అభినందించారు.


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు

ఎన్నికల కౌంటింగ్
2వ ర్యాండమైజేషన్ పూర్తి

- కౌంటింగ్‌కు నలుగురు పరిశీలకులు
- జిల్లా ఎన్నిక అధికారి డాక్టర్ మాధవీలత


రెండో ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌వో మాధవీలత , ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు బీజై కుమార్ కందయాతిరామ్, టాన్ సింగ్ జి, మోమిన్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ 2వ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు బీజై కుమార్ కందయాత్ రాయ్, టాన్ సింగ్ జిమోమిన్ సమక్షంలో శనివారం సాయంత్రం ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే మాధవీలత మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు సాంకేతికపరమైన విధానంలో కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. రెండో ర్యాండమైజేషన్‌లో భాగంగా కౌంటింగ్ నిర్వహించే క్రమంలో తొలి ర్యాండమైజేషన్‌లో గుర్తించిన సిబ్బందిని నియోజకవర్గాల వారీగా కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లాకు నలుగురు ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులను నియమించినట్టు తెలిపారు. కె.బాల సుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోచ, బీజైకుమార్ కందయాత్ రాయ్, టాన్‌సింగ్ ఐజీ మోమినిల సమక్షంలో జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్, డీఆర్‌వో జి.నరసింహులు, సీపీవో ఎల్.అప్పలకొండ, ఎన్ఐసీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- రూ.1.49 లక్షలు విలువైన విక్రయాలు నిలిపివేత

గొల్లప్రోలు, జూన్ 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్, శివ ఏజెన్సీస్‌లో తనిఖీలు జరిపారు. స్రవంతిలో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో రూ.1.49 లక్షలు విలువైన 82.175కిలోల ప్రత్తి విత్తనాల విక్రయాలను నిలుపుదల చేస్తూ స్టాప్ సేల్ ఉత్తర్వులు జారీ చేశారు. శివ ఏజెన్సీస్‌లో అన్నీ సక్రమంగా ఉన్నా యి. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో నిరంతరాయంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచినా నకిలీ విత్తనాలు విక్రయించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు, శ్రీనివాసరెడ్డి, భార్గవరమేష్, నవీన్, జగన్నాథరెడ్డి, వల్లీ, కిషోర్, శివ, మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కాకినాడ

స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించిన జేసీ

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 1: జేఎన్‌టీయూకేలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీఎంలు,ఇతర సామాగ్రిని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు.ఈసీ ఆదేశాలతో ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలిస్తున్నామన్నారు.

చంద్రబాబుకు ఎమ్మెల్యే చినరాజప్ప అభినందన


చంద్రబాబును అభినందిస్తున్న రాజప్ప

సామర్లకోట, జూన్ 1: తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబు విదేశీ ప్రయాణం ముగించుకుని తిరిగి రాష్ట్రానికి చేరుకున్న సందర్భంగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కాకినాడ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్, ఫలితాల పైనా చంద్రబాబు ఎమ్మెల్యే రాజప్పతో సుదీర్ఘంగా సమీక్షించారు. రానున్నది ఎన్డీఏ కూటమి పాలనేనని సర్వత్రా కార్యకర్తలలో హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయని రాజప్ప వివరించారు. ఓట్ల లెక్కింపులో ఎటువంటి అరాచకాలు జరుగకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండేలా కృషి చేయాలని చంద్రబాబు రాజప్పకు సూచించారు. చంద్రబాబును కలిసిన వారిలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, బండారు సాగర్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన సత్యప్రభ



ప్రత్తిపాడు, జూన్ 1: టీడీపీ జాతీ య అధ్యక్షుడు నారా చంద్రబాబును శనివారం ప్రత్తిపాడు టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి సత్యప్రభ తరలివెళ్లి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన విధానం, గెలుపు అవకాశాలు, మెజార్టీ వంటి అంశాలను సత్యప్రభ చంద్రబాబుకు వివరించారు. ఈ ఎన్నికల్లో చాలా బాగా పని చేశారని చంద్రబాబు సత్యప్రభను అభినందించి సంబరాలకు సిద్ధంగా ఉండాలన్నారు.

'కౌంటింగ్‌ను సమర్థవంతగా నిర్వహించాలి'

పెద్దాపురం, జూన్ 1: ఈనెల 4న ఓట్ల కౌంటింగ్‌ను సమర్థవంతగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు పేర్కొన్నారు. స్థానిక మహారాణీ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి శనివారం ఆయన శిక్షణ నిర్వహించారు. కాకినాడలో జేఎన్టీయూకేలో ఈవీఎంలను మూడంచెల భద్రత నడుమ భద్రపరిచారన్నారు. నియోజకవర్గానికి సంబంధించి 201 పోలింగ్ బూతులకు గాను 14 టేబుల్స్ ద్వారా 15 రౌండ్ల ఓట్ల లెక్కింపు జరుగు తుందన్నారు. కౌంటింగ్ కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని, అలాగే ఏజంట్లు సంబంధిత ధ్రువపత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. కౌంటింగ్ సజావుగా సాగేందుకు ప్రజాప్రతినిధులు, ఏజంట్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎస్.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'కౌంటింగ్ ఏజెంట్లుగా తొలగించాలి'

కాకినాడ సిటీ, జూన్ 1: ఈ నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు నిమిత్తం నియమితులైన హత్యాయత్నం కేసుల్లో ఉన్న వ్యక్తులను కౌంటింగ్ ఏజెంట్లుగా తొలగించాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి సత్య శనివారం జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా పరిధిలోని తుని పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం, వివిధ కేసులు గల ముగ్గురిని ఎన్నికల సంఘం కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా తక్షణం తొలగించాలని కేసుల వివరాలతో సహా పొందుపరుస్తూ విజ్ఞప్తి చేశారు. కడపలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు అక్కడి రౌడీషీటర్లను డీఎస్పీ జిల్లా నుంచి బహిష్కరించారన్నారు. అయితే కాకినాడ జిల్లాలో రౌడీషీటర్లను, హత్యాయత్నం కేసుల్లో ఉన్న వ్యక్తులను కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించడాన్ని ఈ జిల్లా ఎస్పీ అభ్యంతరం వ్యక్తం చేయడం లేదన్నారు. రౌడీషీటర్లు కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించవచ్చా లేదా అనేది ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని సత్య కోరారు.

'కార్మికులపై నిర్లక్ష్యం తగదు'

ఏలేశ్వరం, జూన్ 1: కార్మికులపై నిర్లక్ష్యం తగదని సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని చిన్నింపేట గ్రామంలో ఉన్న జీడిపిక్కల పరిశ్రమ యాజమాన్యం ఎటువంటి నోటీసులు లేకుండా సుమారు 80మందిని తొలగించి, పనికి రావొద్దనడం గేటు దగ్గర అడ్డుకోవడం అధికారుల నిర్లక్ష్యమేనని శనివారం కార్మికులు గేటు వద్ద ఆందోళన చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గతంలో తహశీల్దార్ రంగారావుకు వినతిపత్రం ఫిర్యాదు చేశామన్నారు. గత కొన్నేళ్లుగా ఇంటర్ స్నాక్స్ కాజు ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పని చేస్తున్న కాంటాక్ట్ ఉద్యోగులను ఏ సమాచారం ఇవ్వకుండా తొలగించిన యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.సాల్మన్, యం.కృష్ణ, బి.నాని, సురేష్, నరేంద్ర తదితరులున్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు'

రౌతులపూడి, జూన్ 1: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని తహశీల్దార్ విద్యాపతి, ఎంపీడీవో ప్రేమసాగర్, ఎస్ఐ అబ్దుల్ నబీ ఉత్తర్వులు జారీ చేశారు. పెట్రోల్ బంకుల వద్ద లూజు పెట్రోల్ విక్రయాలు జరపకూడదని, గ్రామాల్లో బాణసంచా పేల్చకూడదని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులు గుంపులుగా ప్రజలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఎన్నికలు ఫలితాలు సమయంలో ఇబ్బందులు ఉంటే తక్షణమే మా దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు.

ఉత్తమ సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు

అన్నవరం, జూన్ 1: ఉత్తమసేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం దేవస్థానం డిప్యూటీ ఇంజనీర్ బీఎస్ రాంబాబు పదవీ విరమణ సందర్భంగా అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాంబాబు దంపతులను సత్కరించారు. విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేసినప్పుడే పదవీ విరమణ అనంతరం గుర్తింపు కొనసాగుతుందన్నారు. సహాయ కమిషనర్ విశ్వనాథరాజు, సంఘ అధ్యక్షులు బీఎస్ రాంబాబు, బలువు సత్యశ్రీనివాస్ ఇతర ఉద్యోగసంఘ నాయకులున్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు'

తుని రూరల్, జూన్ 1: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తుని వ్యవసాయ శాఖ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో పత్తి, కూరగాయాల విత్తనాల నాణ్యత, స్టాక్ రికార్డులు, బిల్లు పుస్తకాలను తనిఖీ చేశారు. విత్తనాలకు మొలక శాతం కట్టి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పత్తి విత్తనాలను నిర్దేశించిన ధరలకు అమ్మాలని, నకిలీ విత్తనాలు విక్రయాలు చేపట్టకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేయాల్సి వస్తుందన్నారు.

'జనవిజ్ఞాన వేసవి కేంద్రంతో వినోదం'

తాళ్లరేవు, జూన్ 1: విద్యార్థుల మానసిక ఒత్తిడిని దూరం చేసి వేసవి వినోదాన్ని జనవిజ్ఞాన వేసవి కేంద్రం ద్వారా అందిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కె. రాధాకృష్ణ అన్నారు. శనివారం నీలపల్లి హైస్కూల్లో యానాం కమిటీ జనవిజ్ఞానవేదిక వేసవి వినోదకేంద్రం ఐదురోజులు పాటు వినోద కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాజిక్, చిత్రలేఖనం, కర్రసాము వంటి వాటిని విద్యార్థులకు అందించారు. యూటీఎఫ్ నేత ఇల్ల సాయిబాబు, యానాం కమిటీ ఉపాధ్యక్షుడు దంగేటి త్రిమూర్తులు, క్రాఫ్ట్‌టీచర్ మంగతాయారు, జెవివి మహిళా నాయకురాలు కాశి కరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'సెల్‌ఫోన్‌కు బానిసలు చేయవద్దు'

ప్రత్తిపాడు, జూన్ 1: విద్యార్థులను సెల్‌ఫోన్‌కు బానిసలు చేయవద్దని, దీని వల్ల వారు మానసిక, శారీరక ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు తెలిపారు. మండలంలోని ధర్మవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు వి.సన్యాసి ఆధ్వర్యంలో విద్యార్థులకు సెల్‌ఫోన్ వినియోగంపై దూరంగా ఉండాలని అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం.సింహాద్రి, స్థానికులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న తెలుగు తమ్ముళ్లు

జగ్గంపేట, జూన్ 1: చంద్రబాబు ముఖ్యమంత్రి, జ్యోతుల నెహ్రూ ఎమ్మెల్యే కావాలని తెలుగు తమ్ముళ్లు మొక్కులు చెల్లించుకున్నారు. రంపయర్రంపాలెం టీడీపీ యువనాయకుడు, నియోజకవర్గ ఐటీడీపీ ప్రెసిడెంట్ ఉంగరాల గణేష్ ఆధ్వర్యంలో కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామికొండపైకి 615మెట్లు, తిరుమలాయపాలెం వరాహి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి 325మెట్లు,గుమ్మళ్ళదొడ్డి శ్రీ సత్యనారాయణ స్వామి కొండపైకి 160మెట్లు, రంపయర్రంపాలెం శ్రీ పంచ పాండవులు కొండపైకి సుమారు 330 మెట్లు, కనుపూరు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కొండపైకి సుమారు 450 మెట్లు, మల్లవరం వేణుగోపాలస్వామి కొండపైకి రోడ్డు మార్గం, తంటికొండ వెంకటేశ్వరస్వామి కొండపైకి 325 మెట్లు, ఐ.పోలవరం వెంకటేశ్వర స్వామి కొండపైకిరోడ్డు మార్గం, సీతపల్లి బాపనమ్మ తల్లి దర్శనం, అన్న వరం శ్రీ సత్యనారాయణ స్వామి కొండపైకి సుమారు 460 మెట్లు, సింహాచలం శ్రీ వరాహి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి సుమారు 1000 మెట్లు, అనంతరం తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి కొండపైకి 3550 మెట్లు, విజయవాడ కనకదుర్గమ్మ తల్లి కొండపైకి సుమారు 400 మెట్లు ఎక్కి శనివారం మొక్కులు పూర్తి చేసుకుని రంపయర్రంపాలెం చేరుకున్నారు. పంతం వీరబాబు, నవనాని గణపతి, దేవారపు పెద్దకాపు, గుడిసే లక్ష్మీనారాయణ, నోట్ల చిన్నోడు, బుక్కా దుర్గ, ఇనకొండ రాజు, గుర్తుత్తి నాగేశ్వరరావు, కాకర దుర్గారావు, సత్తిబాబు, కడవల వీరబ్బాయి, ఆకుల శ్రీను, రొక్కం దుర్గ, తిరుపతి సత్తిబాబు, రాము ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

» ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
» కిటకిటలాడిన ఆలయాలు



పిఠాపురంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, గండేపల్లి: మల్లేపల్లిలో వేషధారణలు

పోర్టు సిటీ (కాకినాడ), జూన్ 1: జిల్లాలో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాకినాడలోని పలు దేవాలయాలలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. సత్కళా వాహినిలో హనుమాన్ చాలీసా సంగీత పారాయణం, డాక్టర్ ఇవీవీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి కీర్తనల గానం జరిగింది. రామారావుపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. దేవాలయంవీధిలోని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. సూర్యనారాయణపురం, దుమ్ములపేట, రామకృష్ణారావుపేట తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. మెయిన్‌రోడ్‌లోని రామాలయంలో స్వామివారికి నిర్వహించిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయా దేవాలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పిఠాపురం: పట్టణంలోని మోహన్‌నగర్‌లో లక్ష్మీ గణపతి సీతారామాంజనేయస్వామి ఆలయంలోని స్వామికి పంచామృతాభిషేకం, నాగవల్లి పత్ర సహిత సిందూర అర్చన నిర్వహించి అప్పాలు, గారెలు నివేదించారు. అర్చకుడు పీవీజే ఆచార్యులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అగ్రహారం వద్ద గల వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, సూరవరపు సత్తిరాజు పాల్గొన్నారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్వామికి సింధూర అర్చన జరిగింది. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కొండేపూడి సూర్యప్రకాష్, సూరవరపు సుబ్బారావు, సోము సత్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్ కల్యాణమండపం ఏరియాలో వరసిద్ది వినాయక అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాల్లో మురాలశెట్టి శ్రీను, దేవరపల్లి గోపి, ఊటా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: దుర్గాడ శివాలయంలోని దాసాంజనేయస్వామి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన, సహస్ర నామాలతో సింధూరపూజ జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. తాటిపర్తిలోని అపర్ణా పుష్కరిణి గట్టుపై రావిచెట్టు కింద ఉన్న ఆంజనేయస్వామిని సింధూరంతో అలంకరించి తమలపాకులతో పూజలు చేశారు. అర్చకుడు ప్రభాకర శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

గండేపల్లి: మల్లేపల్లిలో జాతీయరహదారి పక్కన అభయాంజనేస్వామి ఆలయం వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సిందూరంపూజ, హోమాలు నిర్వహించి రథంపై ఉంచి రాముడు, సీత, హనుమాన్, లవకుశ వేషధారణలతో కోలాట నృత్యాల నడుమ గ్రామమంతా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానంలో భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ స్వామివారిని దర్శించుకున్నారు.

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం, లింగంపర్తి, భద్రవరం, సి.రాయవరంలో రామాలయాల వద్ద విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ సభ్యులు.. పట్టణంలో శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో, హనుమాన్ జంక్షన్, పాత బస్‌స్టాండ్, షిర్డినగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి భజలను, హనుమంతుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బస్వా ప్రసాద్, సుంకర సత్తిబాబు, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్ ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక చెక్‌పోస్టుసెంటర్, వేణుగోపాలస్వామి ఆలయం, నరేంద్రగిరి శ్రీరామ క్షేత్రం వద్ద హనుమాన్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మవరం, రాచపల్లిలోని హనుమాన్ ఆలయాల వద్ద హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి భజన బృందాలు భక్తి గేయాలు ఆలపించారు. ధర్మవరం నవభారత్ పవర్ ప్లాంట్‌లో ఆంజనేయుడి ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది.

కొత్తపల్లి: కొత్తపల్లి ఊరచెరువు, వీవీఎస్ విద్యా సంస్థ సమీపంలో, ఉప్పాడ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న హనుమాన్ విగ్రహాలకు తమలపాకుల దండలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

అన్నవరం: సత్యదేవుడి క్షేత్రపాలకులైన సీతారాముల ఆలయం ఎదురుగా ఉన్న హనుమ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకములు అనంతరం విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం తమలపాకులతో ఆంజనేయుడిని అర్చించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కిర్లంపూడి: కిర్లంపూడి, రామచంద్రపురం, తామరాడ గ్రామాల్లో స్వామివారికి తమలపాకు, సింధూరం పూజలు చేపట్టారు. రామచంద్రపురం ఆంజనేయస్వామి ఆలయంలో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేకపూజలు నిర్వహించారు.

జగ్గంపేట: జగ్గంపేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రావులమ్మ తల్లి తోపుడు బండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పంచముఖ ఆంజేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి.

తొండంగి: ఏ.కొత్తపల్లి, తొండంగి, బెండపూడి, ఏవినగరం తదితర గ్రామాల్లో హనుమంతుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింధూర పూజ, తమలపాకుల పూజలు జరిపారు. హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ చేశారు.

పెద్దాపురం: మండల పరిధిలోని వాలు తిమ్మాపురంలో ఆంజనేయస్వామి ఆలయం, పెద్దాపురం మెయిన్‌రోడ్డు, మిరపకాయల వీధిలో ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, తదితర హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. పలుచోట్ల భారీ అన్నదానాలు చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

సామర్లకోట: సామర్లకోట పట్టణం, మండలంలోని మాధవపట్నం, వేట్లపాలెం, వీకె. రాయపురం ఆలయాలలో హనుమాన్ పూజలు నిర్వహించారు. కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద గల ఆలయంలో చక్రవర్తుల ఆచార్యులతో అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. సుందరకాండ పారాయణ చేశారు. భక్తుల సౌజన్యంతో నేతి గారెల మాలను వేసి హనుమంతుని విశేషంగా అలంకరించారు. కంచి మహాసంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి పద్మ దంపతులు పాల్గొన్నారు. ప్రసాదాలు పంపిణీ చేసారు. వేట్లపాలెం రామకృష్ణ సేవాసమితిలో హనుమాన్ చాలీసా పారాయణ పూజలు నిర్వహించారు.

రౌతులపూడి: రౌతులపూడి వ్యవసాయకూలీ సంఘం ఆధ్వర్యంలో లచ్చిరెడ్డిపాలెం, బలరామపురం, ఎస్.అగ్రహారం, పి.చామవరం, శృంగవరం, బంగారయ్యపేట మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

తాళ్లరేవు: చొల్లంగి శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భారీ అన్నదానం చేపట్టారు. పోలేకుర్రు, తాళ్లరేవు, జార్జీపేట తదితర ప్రాంతాల్లో పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పోతుల చక్రశేషారావు, కనకాల సిద్దుశేషారావు పాల్గొన్నారు.

కోటనందూరు: అల్లిపూడి, కోటనందూరు, చిన్నాయిపాలెం, కోట్టాం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానాలు నిర్వహించారు.

కరప: అరట్లకట్ట, వలసపాకల, కరప, కొరుపల్లి, గొర్రిపూడి, నడకుదురు, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, వేళంగి, సిరిపురం, కూరాడ, యండమూరు, గురజనాపల్లి, జడ్.బావారం, తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

తుని రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రం, ప్రసిద్ధి పుణ్యక్షేతం లోవ దేవస్థానం, తేటగుంట, ఎస్.అన్నవరం, తునిలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు.

'పంట కాలువలకు మరమ్మతులు చేయాలి'

ప్రత్తిపాడు, జూన్ 1: మండలంలోని పంట కాలువలు, వ్యవసాయ చెరువులు, మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో డేవిడ్‌రాజును కలిసి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన కాలువలు అభివృద్ధి చేయకపోవడం వల్ల శివారు పంట పొలాలకు నీరు అందడంలేదన్నారు. ఏలూరు నుంచి ప్రత్తిపాడు వచ్చే పెరుమాళ్ళ రాజు కాలువకు మరమ్మతులు చేయకపోవడం వల్ల సాగునీరు అందడం లేదన్నారు. అధికారులు స్పందించి ఈ కాలువలు, చెరువుల అభివృద్ధిపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ యాదవ్, మదినే బాబ్జి తదితరులున్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ఏలేశ్వరం, జూన్ 1: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. వ్యవసాయ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ రైతులు దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యత చూసుకోవాలన్నారు. ఎంఈవో అబ్బాయి మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు 80శాతం వచ్చాయని తెలిపారు. ఎంపీడీవో వి.అరుణ, ఎంఈవో కె.వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, సాదే లోవరాజు పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్ సిబ్బంది శ్రమదానం


చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

సర్పవరం జంక్షన్, జూన్ 1: కాకినాడ రెండో డివిజన్‌లో నగరపాలక సంస్థకు చెందిన తోటసుబ్బారావునగర్ పార్కు చెత్తా, వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా మారింది. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో పవర్ గ్రిడ్ సిబ్బంది శ్రమదానం చేశారు. వారంతా పవర్ గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా శ్రమదానం చేసి పార్కును పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. పార్కులోని చెత్తా, వ్యర్థాల తొలగింపు, పిచ్చి మొక్కలు తీసివేత కార్యక్రమం గత వారం రోజులుగా హెచ్ఆర్ మేనేజర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమ దానం చేసి తొలగించారు. సత్యవర్ధన్, కోటేశ్వరరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. పవర్ గ్రిడ్ సిబ్బందికి ఆల్ ఈజ్ వెల్ ఫౌండర్ కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల షాపుల తనిఖీ


రౌతులపూడి, జూన్ 1: ప్రభుత్వం నిర్ణయించే ధరలకే రైతులకు విత్తనాలు, ఎరువులు అమ్మకాలు జరపాలని వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వర్ అన్నారు. రౌతులపూడిలో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీ రేట్ల కంటే అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కువ ధరలకు అమ్మినట్టయితే రైతులు వ్యవసాయాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యార్థుల వృద్ధి రేటును పెంచాలి : డీఈవో


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

కరప, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వృద్ధి రేటును పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో శనివారం కరప, పెదపూడి మండలాలకు చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు మించి ఉన్నతమైన విద్యనందిస్తామని తల్లిదండ్రుల్లో భరోసా కల్పించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రోత్సహించాలన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూపు దుస్తులు, బ్యాగ్‌లు, షూస్, అమ్మఒడి తదితర ప్రభుత్వ స్కీమ్‌లను వివరించి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, ఉన్నతమైన విద్యాప్రమాణాలను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. డీవైఈవో కె.వెంకటేశ్వరరావు, కరప, పెదపూడి మండలాల విద్యాశాఖాధికారులు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

'కౌంటింగ్‌లో వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి'


కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జూన్ 1: కౌంటింగ్ సమయంలో వైసీపీ కుట్రలకు పాల్పడే అవకాశం ఉందని, ఏజెంట్లు అప్రమత్తంగా ఉంటూ తిప్పికొట్టాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శనివారం కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. తోటి ఏజెంట్లతో వాగ్వివాదాలకు దిగవద్దని, ఏది ఉన్న ఆర్వో, ఏఆర్వోల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు మించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించబోతున్నదని వర్మ తెలిపారు. ఎగ్జిట్‌పోల్స్ అన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తున్నాయని తెలియజేస్తున్నాయన్నారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తున్నారని తెలిపారు.

టీడీపీలో చేరిక

పిఠాపురంలో అగ్రహారం ప్రాంతానికి చెందిన నూతాటి కృష్ణ మిత్రబృందం సభ్యులు శనివారం టీడీపీలో చేరగా వారికి వర్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పలుచోట్ల భారీ వర్షం


ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి, జూన్ 1: మండలంలో శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. మధ్యాహ్నం పిడుగులు పడ్డాయి. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ వైర్లపై చెట్లుకొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు గంటన్నరపాటు కురిసిన వర్షం 26.2 మిల్లీమీటర్లుగా నమోదైనట్టు కొత్తపల్లి రెవెన్యూ సహాయ గణాంకుడు బండి నూకరాజు తెలిపారు. పలుగ్రామాల్లో దాళ్వా అనంతరం చేలల్లో జల్లిన పైరు చేలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సామర్లకోట: శనివారం తెల్లవారుజామున సామర్లకోట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మెరుపులు, ఉరుములతో కూడిన ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని అన్ని ప్రధాన డ్రైన్లు పొంగి ప్రవహించి రోడ్లపైకి బురద చేరింది.

తొండంగి: మండలంలో శనివారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభాంతో తెల్లవారుజామునుంచి ఉరుములు మెరుపులతో ఆకాశం దద్దరిల్లింది. వర్షంతో ప్రజలంతా ఉపశమనం పొందారు.

ప్రత్తిపాడు: మండలంలో శనివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చల్లటి గాలులతో వాతావరణం చల్లబడింది. గత నెలరోజులుగా మండుతున్న ఎండలతో అల్లాడుతున్న మండల ప్రజానీకం ఈ చల్లబడ్డ వాతావరణం సేదతీరినట్టు అయింది.


ఈదురు గాలులకు కొత్తపల్లిలో విరిగిన చెట్టు కొమ్మ

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


మృతదేహం వద్ద కూలీలు

ఏలేశ్వరం, జూన్ 1: మండలంలోని కొత్త ఎర్రవరంలో ఉపాధి పనికి వెళ్లిన తంగేటి జోగారావు(60) మృతి చెందాడని ఏపీవో రాజగోపాల్ శనివారం తెలిపారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడని స్థానికులు చెప్పారు. మృతుడికి భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి పాడి గేదె మృతి


పెదశంకర్లపూడిలో మృతిచెందిన గేదె

ప్రత్తిపాడు, జూన్ 1: పెదశంకర్లపూడి గ్రామంలో బీసీ కాలనీ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి పాడి గేదె మృతి చెందింది. జనావాసాల మధ్య ఈ ప్రదేశంలో ఈ వైర్లు వేలాడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు


కారుపై పడిన విద్యుత్ స్తంభం

పెద్దాపురం, జూన్ 1: పెద్దాపురం నుంచి సూరంపాలెం వెళ్లే రహదారిలో ఓకారు ఆదుపు తప్పి ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సూరంపాలెం గ్రామానికి చెందిన వానపల్లి సోమరాజు పెద్దాపురానికి కారులో వస్తుండగా అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో స్తంభం విరిగి కారుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

అప్పలరాజు పుట్టిన రోజు వేడుకలు



జగ్గంపేట, జూన్ 1: రాష్ట్ర టీడీపీ పార్టీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు పుట్టిన రోజు వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. జగ్గంపేట కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ చైర్మన్ జ్యోతుల మణి ముఖ్య అతిథిగా కేక్ కట్ చేసి అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ తోట నవీన్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, టీడీపీ మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగ రౌతు రామకృష్ణ, జీను మణిబాబు ఉన్నారు.

సామర్లకోటలో స్వచ్ఛతా పక్వాడా

సామర్లకోట, జూన్ 1: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం సామర్లకోట ప్రభుత్వాసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల ఆవరణలలో చెత్తచెదారాలను, తుప్పమొక్కలను తొలగించారు. పవర్‌గ్రిడ్ సిబ్బంది సుమారు 30 మంది ఈ స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 8 ట్రాక్టర్ల చెత్త చెదారాలను తరలించారు. మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, పవర్‌గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్, మేనేజరు సత్యనారాయణ, కోటేశ్వరరావు, మూర్తి తదితరులున్నారు.

మిల్విన్ జోన్స్ విగ్రహానికి నివాళి

జగ్గంపేట, జూన్ 1: లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ మిల్విన్ జోన్స్ 62వ వర్ధంతిని స్థానిక లైన్స్ కంటి ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. డిస్ట్రిక్ లైన్స్‌క్లబ్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు మిల్విన్‌జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌కే రేష్మ, అడ్మినిస్ట్రేటివ్ పి.సతీష్, పి.విజయ్‌కుమార్, హాస్పటల్ సిబ్బంది ఎం.సత్యవేణి, బి.సౌమ్య, బి.మైథిలి తదితరులు పాల్గొన్నారు.

నాగబాబు పరామర్శ

కరప, జూన్ 1: కాజులూరు మండలం శీల గ్రామానికి చెందిన ఎన్నారై అనిశెట్టి స్వామిని శనివారం సాయంత్రం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు పరామర్శించారు. రెండు రోజుల క్రితం అనిశెట్టిస్వామి తల్లి శేషారత్నం మృతిచెందడంతో శనివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


అనిశెట్టి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగబాబు